భక్తులకు తాగునీటి కొరత రానీయొద్దు

- ఆలయ ప్రాంగణమంతా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి
- పర్ణశాల అధికారుల సమీక్షలో భద్రాద్రి ఆలయ ఈవో రమాదేవి

మాట్లాడుతున్న భద్రాద్రి ఆలయ ఈవో రమాదేవి

పర్ణశాల, ఏప్రిల్ 10: శ్రీరామనవమి కోసం పర్ణశాలకు వచ్చే భక్తులకు తాగునీటి కొరత రానీయొద్దని భద్రాద్రి దేవస్తానం ఈవో రమాదేవి పర్ణశాల ఆలయ అధికారులకు సూచించారు. ఆలయ ప్రాంగణమంతా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, గోదావరిలో స్నానఘట్టాల వద్ద బారికేడ్లు అమర్చాలని ఆదేశించారు. భద్రాది దేవస్థాన అనుబంధ పర్ణశాలలో ఈ నెల 17న జరుగనున్న శ్రీరామనవమి ఏర్పాట్లను పరిశీలించేందుకు బుధవారం ఆమె ఇక్కడికి వచ్చారు. ఆయా శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతారాముల కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా తాత్కాలిక మరుగుదొడ్లు, డ్రెస్సింగ్ రూములు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం, పర్ణశాలలో నిర్వహించే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పర్ణశాలకు వచ్చే భక్తులకు చల్లని మజ్జిగ అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతీరోజూ పదిహేను లీటర్లు, శని, ఆదివారాల్లో ఇరవై ఐదు లీటర్లు పంపిణీ చేయాలని సూచించారు. అధికారులు శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, ఈదయ్య, ముత్యాలరావు, గణేశ్, ఆదినారాయణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మాధ్యమంలో వివరాలను పొందుపర్చాలి

- ఎస్ఏపీ అప్లికేషన్లపై అవగాహన కలిగి ఉండాలి
- డైరెక్టర్(పా) ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వరరెడ్డి

మాట్లాడుతున్న డైరెక్టర్(పా) ఎన్‌వీకే శ్రీనివాస్

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 10 : సింగరేణిలో ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్ అప్లికేషన్ రూపంలో డిజిటల్ మాధ్యమంలో పొందుపర్చడానికి నిర్ణయించామని, సంబంధిత అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని డైరెక్టర్(పా) ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్‌హాల్‌లో బుధవారం ఫైళ్లు, డాక్యుమెంట్లు, కరస్పాండెన్స్‌ల వివరాలను ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్ అప్లికేషన్ మాద్యమంలో పొందుపర్చడం, అమలుపర్చడంపై ఏర్పాటు చేసిన సమీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. 2007-08 సంవత్సరం నుంచి ఏఎస్‌పీ అప్లికేషన్‌ను అమలు పర్చుకుంటున్నామని, కోల్ అనుబంధ సంస్థల్లో మొదటగా మన సింగరేణి సంస్థలోనే అమలుపర్చామని, అప్పటినుంచి ఇప్పటివరకు సంస్థకు సంబంధించిన అన్ని డిపార్ట్‌మెంట్లలో విజయవంతంగా అమలు పర్చుకున్నామన్నారు. ఇకపై రోజువారి చేసే లెటర్స్, నోట్, ఇతర డాక్యుమెంట్లను పేపర్‌పై కాకుండా నేరుగా డిజిటల్‌లో అమలుపర్చడానికి కావాల్సిన చర్యలను తీసుకుంటున్నామని అన్నారు. అనంతరం ఏఎస్‌పీ కన్సల్టెంట్ నవీన్ నాయుడు ఈ ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్ అప్లికేషన్ వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ హరిప్రసాద్, జీఎం సివిల్ జక్కం రమేశ్, జీఎం పర్సనల్ బసవయ్య, రాంకుమార్ రావు, జీఎంలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

లక్ష కుసుమార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 10 : మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీదేవి వసంత నవరాత్రి ఉత్సవాలు రెండోరోజు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం నాదనీరాజనం, శ్రీచక్రార్చన, సూర్య నమస్కారాలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, శ్రీసూక్త పారాయణ, చండీసప్తసతి పారాయణము, హోమములు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం మల్లెపూలతో లక్ష కుసుమార్చన, సాయంత్రం నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలు జరిపారు. పాల్వంచ పట్టణానికి చెందిన అమ్మవారి భక్తులు ఆడబోయిన సాయి బాబా-రేణుకాదేవి దంపతులు ఆలయ నిర్మాణ పనులకు రూ.51,116లను విరాళంగా అందించారు.

మనరాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మట్టి లారీ పట్టివేత

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 10 : అక్రమంగా మట్టి రవాణ చేస్తున్న లారీని పట్టుకొని యజమానిపై పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాండురంగాపురం వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమతి లేకుండా పాండురంగాపురం నుంచి పాల్వంచకు మట్టిని రవాణా చేస్తున్న లారీని పట్టుకున్నారు. యజమానిపై కేసు నమోదు చేసి లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 : ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖాధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయంలోని తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. సమస్యలు తలెత్తకుండా సజావుగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 25 నుంచి మే 2వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు రెండు దఫాలుగా నిర్వహించనున్నట్లు చెప్పారు. పదో తరగతి పరీక్షలకు జిల్లాలో మూడు సెంటర్లకు గాను 846మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 4 కేంద్రాల్లో 978 మంది హాజరవుతారన్నారు. కేంద్రాల్లోకి మొబైల్స్, వాచీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించకూడదని, కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేయాలని, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కంద్రాల సమీపంలో జిరాక్సు సెంటర్లను మూసివేయించాలని, పరీక్షా కేంద్రం వద్ద అత్యవసర మందులతోపాటు ఏఎన్ఎం సిబ్బందిని నియమించాలని వైద్యశాఖాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరచారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి, పోలీస్, వైద్య, పోస్టల్, విద్యుత్, మున్సిపాలిటీ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

'శ్రీరామనవమి టికెట్లకు అనూహ్య స్పందన'

భద్రాచలం, ఏప్రిల్ 10: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 17న జరిగే శ్రీరామనవమి, 18న జరిగే పట్టాభిషేకం మహోత్సవాలకు తాము అందుబాటులో ఉంచిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టికెట్లకు అనూహ్య స్పందన లభిస్తోందని దేవస్థానం అధికారులు బుధవారం తెలిపారు. రూ.7,500 విలువ గల మొత్తం 1,000 టికెట్లకుగాను 750 టిక్కెట్లను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు చెప్పారు. వాటిల్లో ఇప్పటి వరకు 254 టికెట్లు, ఆఫ్‌లైన్‌లో 83 టికెట్లు బుక్ అయినట్లు చెప్పారు. సెక్టార్ 1బీలో రూ.2,500 విలువ గల 1,175 టికెట్లగాను 590 టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచగా 134 టికెట్లు, ఆఫ్‌లైన్‌లో 149 టికెట్లు బుక్ అయినట్లు చెప్పారు. సెక్టార్ 2ఏలో రూ.300 విలువగల 735 టికెట్లకుగాను 550 టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచగా అన్ని టికెట్లను భక్తులు బుక్ చేసుకున్నట్లు వివరించారు. అదేవిధంగా, సెక్టార్ 2బీ రూ.300 విలువగల మొత్తం 770 టికెట్లకు గాను 570 టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచగా వాటిల్లో 178 టికెట్లు బుక్ అయ్యాయని, ఆఫ్‌లైన్‌లో కేవలం 25 టికెట్లు మాత్రమే బుక్ అయ్యాయని తెలిపారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించం : డీఎంహెచ్‌వో

పినపాక, ఏప్రిల్ 10: వైద్య సేవలు అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ శిరీష హెచ్చరించారు. మండలంలోని జానంపేట ప్రభుత్వ వైద్యశాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. వైద్య సేవలను, మందుల నిల్వను, రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ.. రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు చేయించుకునేలా ప్రోత్సహించాలని అన్నారు.

రెండు ఆర్ఎంపీ క్లినిక్‌లు సీజ్

నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్న జానంపేట గ్రామంలోని రెండు ఆర్ఎంపీ క్లినిక్‌లను డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష బుధవారం సీజ్ చేశారు. జానంపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా షడ్వాహన సేవ

షడ్వాహన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 10 : జిల్లాకేంద్రం కొత్తగూడెంలోని ఎంజీరోడ్‌లో ఉన్న శ్రీ విజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా మంగళవారం రాత్రి స్వామివారికి షడ్వాహన సేవ నిర్వహించారు. స్వామివారి ఊరేగింపులో భక్తులు, కోలాట బృందాలు, స్వచ్ఛంద సేవకులు, పోలీసులు పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రసాదాలు స్వీకరించారు.

వేగంగా డ్రైనేజీ మరమ్మతు పనులు

రామవరం, ఏప్రిల్ 10 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని రుద్రంపూర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద డ్రైనేజి కూలిపోవడంతోపాటు చెత్తాచెదారం పేరుకుపోయింది. దుర్వాసన వెదజల్లడంతో మదర్‌థెరిస్సా సేవా సంస్థ అధ్యక్షుడు యాకయ్య సివిల్ డిపార్ట్‌మెంట్ ఏజీఎం రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి డ్రైనేజీ మరమ్మతు పనులు చేయించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చేశారు. దీంతో అంబేద్కరిస్టులు, స్థానిక రుద్రంపూర్‌వాసులు ఏజీఎంకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా డ్రైనేజీపై ప్రీ కాస్ట్ స్లాబులు కూడా వేయించాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సరఫరా పరిశీలన

తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

అశ్వారావుపేట, ఏప్రిల్ 10: మండలంలోని అచ్యుతాపురం, మద్దికొండ, జమ్మిగూడెం పంచాయతీల్లో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా, నీటి నిల్వ, క్లోరినేషన్‌ను మిషన్ భగీరథ క్వాలిటీ కంట్రోల్ ఏఈ చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్ణశాలను సందర్శించిన దేవాదాయశాఖ ట్రిబ్యునల్ జడ్జి

సీతారాములవారిని దర్శించుకుంటున్న దేవాదాయశాఖ ట్రిబ్యునల్ జడ్జి మండా

పర్ణశాల, ఏప్రిల్ 10: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామయ్యను రాష్ట్ర దేవాదాయ శాఖ ట్రిబ్యునల్ జడ్జి మండా వెంకటేశ్వరరావు బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పర్ణశాల దేవస్థాన సిబ్బంది వారికి ఆలయ మర్యాదల ప్రకారం ప్రధాన ద్వారంలో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం పురోహితులు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం వారు పంచవటి, నార చీరెల ప్రాంతాలను సందర్శించారు. పర్ణశాల విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రాచలం ఆలయ దేవస్థానం సీసీ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లుండాలి'

పర్ణశాలలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న అధికారులు

పర్ణశాల, ఏప్రిల్ 10: భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు ఉండాలని భద్రాచలం డీఎల్‌పీవో సుధీర్‌బాబు స్థానిక అధికారులను ఆదేశించారు. భద్రాచలం రామాలయ అనుబంధమైన పర్ణశాల పుణ్యక్షేత్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం ఆలయ పరిసరాలను, అక్కడ జరుగుతున్న తాగునీరు, పారశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో మాట్లాడుతూ.. ఈ నెల 17న జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలనూ సమకూర్చాలని సూచించారు. ఎంపీవో ముత్యాలరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 10: మండలంలోని రాజాపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబూరావు బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఏవోలు, ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల కృషితోనే సంక్షేమ ఫలాలు

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 10: నాడు మహనీయుల కృషి,పోరాటా ఫలితంగానే నేడు సంక్షేమ ఫలాలను అందుకుంటున్నామని ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ అన్నారు. కళాశాలలో బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతీరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ మహనీయుల సేవలు చరిత్రలో ఎప్పటికీ శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బిందు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

రాజీవ్‌నగర్ కాలనీలో ఓటు అవగాహన ర్యాలీ

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 10 : మండలంలోని ప్రభాత్‌నగర్ శివారులోని గొత్తికోయలు నివసించే రాజీవ్‌నగర్‌లో బుధవారం ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఓటుహక్కుప్రాధాన్యతను ఎంపీడీవో వారికి వివరించారు. ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటును వినియోగించుకోవాలని కోరారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో నారాయణ, ఏపీవో రంగా, ఇతరులు శ్రీను, కార్యదర్శి రమేశ్, దేవరాజు, సామ్రాజ్యం పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

చండ్రుగొండ, ఏప్రిల్ 10: మండలవ్యాప్తంగా ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 14 పంచాయతీల్లోని 57 పనులకు 3555 మంది కూలీలు వస్తున్నట్లు ఎంపీడీవో అశోక్ తెలిపారు. పని ప్రదేశాల వద్ద కనీస సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు.

చలివేంద్రం ఏర్పాటు

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 10 : కూరా చారిటబుల్ సర్వీసెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరా శ్రీధర్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన లక్ష్మీదేవిపల్లిలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శ్రీధర్ మాట్లాడుతూ చారిటబుల్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కనకేశ్వర్‌రావు, డైమండ్‌రావు, శ్రీనివాస్, శ్రీరాములు, సాయిప్రసాద్, రుషికుమార్, రమేశ్, నగేశ్, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

మొండికుంటలో..

అశ్వాపురం, ఏప్రిల్ 10: మండలంలోని మొండికుంటలో పంచాయతీ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం తహసీల్దార్/ప్రత్యేకాధికారి స్వర్ణలత ప్రారంభించారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఇల్లెందు రూరల్,ఏప్రిల్ 10: మండలంలోని సంజయ్‌నగర్ నివాసి గండి యాదన్న గౌడ్ ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబీకులను ఏజెన్సీ గౌడ్ హక్కుల పరిరక్షణ సంఘం బాధ్యులు బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. నరాటి వెంకన్న, భంధం నాగయ్య, సత్యం, కోటయ్య, ఆంజనేయులు, శంకర్, సంపత్, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వమే టెట్ ఫీజు చెల్లించాలి

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 10 : రాష్ట్ర ప్రభుత్వమే టెట్ పరీక్ష ఫీజు చెల్లించాలని టీఆర్ఎస్ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ లావుడ్యా పూర్ణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారంలో లేనప్పుడు రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు ప్రస్తుతం అధికారం చేపట్టిన తర్వాత ఎందుకు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.

ప్రజాకవి కానూరికి నివాళి

టేకులపల్లి, ఏప్రిల్ 10: ప్రజాపక్షపాతిగా పాటలు, నాటికలు రచించి, ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలిచిన ప్రజాకవి కానూరి వెంకటేశ్వరరావు ఆదర్శప్రాయుడని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి నోముల భానుచందర్ అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు కానూరి వెంకటేశ్వరరావు తొమ్మిదో వర్ధంతి కార్యక్రమం బుధవారం టేకులపల్లిలోని జరిగింది. భానుచందర్ మాట్లాడుతూ.. ప్రజాకంటకులపై తన కలాన్ని ఆయుధంగా ఎంచుకుని పోరాడారని నివాళి అర్పించారు. నాయకులు నోముల కళావతి, భూక్యా నర్సింగ్, భూక్యా లక్ష్మణ్, తోటకూరి సతీష్, బానోత్ క్రాంతి, కిరణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పించిన ఎమ్మెల్యే జారే

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 10: మండలంలోని బూర్గుడెం గ్రామస్తుడు షేక్ ఖాశీం మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతదేహాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు,

అగ్ని బాధితులకు సాయం

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని ఆసుపాక కాలనీలో కట్టం రాము పూరిల్లు ఈ నెల 9న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఆ కుటుంబానికి బుధవారం జూపల్లి రమేష్ యువసేన బాధ్యులు నగదు, బియ్యం ఇచ్చారు. కునసోతు లింగయ్య, నల్లపు భాస్కరావు, పేరం రఘు, నల్లపు సుబ్బారావు, నల్లను రామకృష్ణ, పసుపులేటి రాము పాల్గొన్నారు.

వినాయకపురంలో ఇఫ్తార్ విందు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని వినాయకపురం గ్రామంలోని మసీదులో ముస్లిం సోదరులకు బీఆర్ఎస్ నాయకుడు బిర్రం వెంకటేశ్వరరావు బుధవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. షేక్ సాజిద్, ఎస్‌కె.ఖాసీం, ఎస్‌డి.హఫీజ్, వలీపాషా, పాషా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి బహిష్కరణ

మణుగూరు టౌన్, ఏప్రిల్ 10: బీఆర్ఎస్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న పార్టీ భద్రాచలం పట్టణ అధ్యక్షుడు తిరుపతిరావును బహిష్కరించినట్లు జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తెలిపారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించిన ఏ స్థాయి వారినైనా ఉపేక్షించేది లేదని సోషల్ మీడియా వేదికగా బుధవారం హెచ్చరించారు. భద్రాచలం పట్టణ అధ్యక్షుడిని త్వరలోనే నియమిస్తానని పేర్కొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పర్ణశాల, ఏప్రిల్ 10: మండలంలోని కాశీనగరం శివార్లలో పేకాట ఆడుతున్న కొందరు జూదరులను దుమ్ముగూడెం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కాశీనగరం శివార్లలో కొందరు పేకాట ఆడుతున్నారని దుమ్ముగూడెం పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో వారు వెంటనే అక్కడికి వెళ్లి తనిఖీలు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.1,550 నగదు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీవో పురుషోత్తం

నీటి వనరులను పరిశీలిస్తున్న అధికారులు

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 10 : మారుమూల గొత్తికోయ గిరిజన గ్రామాలకు అతి సమీపంలో ఉండే నీటి వనరులను పరిశీలించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని, వాటిద్వారా ప్రజలకు తాగునీటి కష్టాలు లేకుండా చూడాలని ఎంపీడీవో పురుషోత్తం అన్నారు. మండలంలోని పునుకుడుచెలక పంచాయతీ పరిధిలోని ఐసోలేటెడ్ హ్యాబిటేషన్ అయిన పూసుగుప్ప(చింతలమెడి)ను ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వంశీతో కలిసి బుధవారం సందర్శించారు. అటవీప్రాంతంలో ఉన్న నీటి చెలమలు, వాగులను పరిశీలించారు. గ్రామస్తులతో నీటి సమస్యలపై చర్చించి, అక్కడ ఉన్న నీటి చెలిమను పరిశీలించి వాటిద్వారా ప్రజలకు నీరు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

పాఠశాలల్లో రంజాన్ వేడుకలు

రంజాన్ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 10 : రంజాన్ పండుగను పురస్కరించుకొని మండలంలోని శ్రీనగర్‌కాలనీ పంచాయతీ ఇందిరానగర్‌కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం రంజాన్ వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం మేకల జ్యోతిరాణి ఆధ్వర్యంలో చిన్నారులు ముస్లిం వేషధారణలో పాఠశాలకు హాజరయ్యారు. ముస్లిం చిన్నారులతో ప్రత్యేక నమాజ్ చేయించారు. అందరూ అలైబలై చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విద్యార్థులకు పండుగ విశిష్టతను హెచ్ఎం వివరించారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

పాల్వంచ, ఏప్రిల్ 10 : పాల్వంచ పట్టణానికి చెందిన కాంట్రాక్టర్స్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఐఎన్‌టీఎస్‌వో ఫైనల్ లెవల్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. 5వ తరగతికి చెందిన నక్క సాత్విక్ 2వ బహుమతి, 6వ తరగతికి చెందిన చెరుకూరి రిషిత 4వ బహుమతి, 3వ తరగతికి చెందిన లునావత్ నిక్షిత్ 6వ బహుమతి సాధించారు. వీటితోపాటుగా 49మంది విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు, గోల్డ్‌మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు పొందారు. విజయం సాధించిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇస్మాయిల్, డీన్ నాగేశ్వర రావు, సీ ఇన్‌చార్జి నాగబాబు, ప్రైమరీ ఇన్‌చార్జి వర్ధిని, పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం జయప్రకాష్ ప్రత్యేకంగా అభినందించారు.

తాగునీరు సక్రమంగా అందించాలి

మాట్లాడుతున్న ఎంపీడీవో ధన్‌సింగ్

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 9: గ్రామాల్లో ఎక్కడా కూడా నీటి ఎద్దడి రాకుండా చూడాలని, తాగునీటిని సక్రమంగా అందించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ధన్‌సింగ్ ఆదేశించారు. వారితో ఆయన బుధవారం మండల పరిషత్ కార్యాలయ